ఒకే గదిలో రెండు తరగతులను కొనసాగుతున్న అధ్యాపకులు

ఒకే గదిలో.. రెండు తరగతులు

సరిపడా గదుల్లేక విద్యార్థుల అవస్థలు

వికారాబాద్, డిసెంబర్ 13 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ట వేశాయి. సరిపడా గదుల్లేక, మౌలిక వసతుల్లేక బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే ఉద్దేశంతో వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ 450 మంది విద్యార్థులుండగా.. 23 గదులకుగా నూ కేవలం 6 గదులే ఉన్నాయి. తెలుగు, ఆంగ్ల, ఉర్దూ మీడియాల్లో విద్యబోధన జరుగుతుండగా.. 20 మంది లెక్చరర్లు ఉన్నారు. ఇంటర్ తెలుగు మీడియం ప్రథమ, ద్వితీయ తరగతుల్లో కలిసి 238 మంది విద్యార్థులు, ఆంగ్ల మీడియంలో 118 మంది, ఉర్దూ మీడియంలో 94 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు, ఆంగ్ల మీడియాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఉర్దూ మీడియంలో బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు కొనసాగుతున్నాయి. గత పదేండ్ల కిందట వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఆరు గదులను నిర్మించగా.. క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో దాని పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మరో భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 2.20 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో విద్యార్థుల సమస్యలు తీరుతాయని అందరూ భావించారు. రూ.కోటితో భవనం స్లాబ్ వరకు పనులు చేరుకొని అక్కడే ఆగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మిగిలిన రూ 1.20 కోట్ల నిధులు విడుదల కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా మధ్యలోనే నిలిచిపోయాయి. ఆ నిధులను విడుదల చేసి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కలిసి విన్నవించారు. తమ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు స్పీకర్‌కు వినతి పత్రాన్ని కూడా అందించారు.

ఆరు బయట చదువులు

భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు ఆరు గదులు సరిపోక..వారు ఆరు బయట, మెట్లు, స్లాబ్ కింద కూర్చుని చదువుకుంటున్నారు. ఉర్దూ మీడియంలో అయితే ఒకే గదిలో రెండు తరగతులను నిర్వహిస్తున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ విద్యార్థులకు ల్యాబ్‌లు లేకపోవడంతో పరిశోధన పరికరాలను బీరువాల్లో పెట్టారు. సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సమస్యల తిష్ట

- ఆరు బయట, మెట్లు, స్లాబ్ కింద కూర్చుని చదువుకుంటున్న స్టూడెంట్స్
- రూ.2.20 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు
- స్లాబ్ వరకు పూర్తైన పనులు
- ప్రభుత్వం మారడంతో మధ్యలోనే నిలిచిపోయి..
- పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు విద్యార్థుల వినతి

అసంపూర్తిగా ఉన్న భవనంలోనే చదువుకుంటున్న విద్యార్థులు

కళాశాలకు స్కావెంజర్ లేకపోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తన సొంత డబ్బుతో మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నారు. సరిపడా ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే కూర్చుంటున్నారు. విద్యాశాఖ కమిషనర్ స్పందించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయించి ...మిగిలిన పనులను త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మధ్యలోనే ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

ప్రయోగశాలను అందుబాటులోకి తేవాలి

ఇక్కడ బోధన బాగున్నది. కానీ, ప్రయోగశాల లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఎంపీసీ, బైపీసీ చదివే విద్యార్థులకు ప్రయోగ శాల ఎంతో దోహదపడుతుంది. అధికారులు స్పందించి ప్రయోగ శాలను అందుబాటులోకి తీసుకురావాలి.

-సాజిత్ ఖాన్, బైపీసీ, ఇంగ్లిష్ మీడియం, రెండో ఏడాది

గదుల్లేక ఆరు బయటే..

కళాశాలలో సరిపడా గదుల్లేక మెట్లు, ఆరుబయట, వరండాలో కూర్చుని తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఫర్నిచర్ కూడా లేకపోవడంతో నేలపైనే కూర్చొవాల్సి వస్తున్నది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలి.

-అక్ష, సీఈసీ, తెలుగు మీడియం, రెండో ఏడాది

మెరుగైన విద్య అందిస్తున్నాం..

ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.1.20 కోట్ల నిధులను విడుదల చేసి భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలి. కాలేజీలో 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి మెరుగైన విద్య అందిస్తున్నాం. ఇప్పటికే ప్రతినెలా యూనిట్ టెస్టులు, మూడు నెలలు, ఆరు నెలలు, ప్రీ ఫైనల్ తదితర పరీక్షలను నిర్వహిస్తూ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. -వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

డైట్‌ను పండుగలా నిర్వహించాలి

- ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 13 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కేజీబీవీ పాఠశాలల్లో ఈనెల 14వ తేదీన నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం ఆయన వికారాబాద్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై స్పెషల్ అధికారులు, హాస్టళ్ల వార్డెన్లు, ఎంపీవోలు, వివిధ శాఖల అధికారులతో జూమ్ యాప్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాలు/పాఠశాలల్లోని విద్యార్థులకు డైట్ చార్జీలను 40శాతం, కాస్మెటిక్ చార్జీలను 200% పెంచిన నేపథ్యంలో ఈ నెల 14న జిల్లాలోని 93 వసతి గృహాల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని.. అందుకు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారి సమక్షంలో వేడుకలను జరుపాలన్నారు. నేటి నుంచి కొత్త మెనూ అమల్లోకి వస్తుందని..సంక్షేమ హాస్టళ్లలో భోజనం మారనున్నదన్నారు. వంటశాలలు, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించాలని ఆదేశించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, బీసీ వెల్ఫేర్ అధికారి ఉపేందర్, హనుమంతరావు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను వెంటనే ప్రభుత్వానికి అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 13 : యాసంగి 22 -23, వానకాలం 23-24 సంవత్సరాలకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి అందించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. సీఎంఆర్ ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి చెల్లించాలని.. చెల్లించని వారి పై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా వానకాల సీజన్‌కు సంబంధించి వరి ధ్యానం సన్న, దొడ్డు రకం వడ్లను కొనుగోలు కేంద్రాల నుంచి త్వరగా దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో డీఎస్‌వో మోహన్‌బాబు, సివిల్ సప్లై డీఎం విజయలక్ష్మి, మిల్లర్లు పాల్గొన్నారు.

ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, వార్డు పరిధిలో పంచాయతీ సెక్రటరీలు, వార్డు ఆఫీసర్లు ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. దరఖాస్తుదారు బీపీఎల్ కార్డు, ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం, చిరునామా అన్ని వివరాలతోపాటు ప్రస్తుతం ఉన్న ఇంటి దగ్గర తీసుకున్న ఫొటో, ఇంటి పరిస్థితిపై లోపల, బయట ఫొటోలు, అలాగే కొత్తగా ఇంటిని నిర్మించతలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీపీవో జయసుధ, మున్సిపల్ కమిషనర్లు, వార్డు ఆఫీసర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర
- ధారూరు కేజీబీవీ పాఠశాల తనిఖీ

ధారూరు, డిసెంబర్ 13 : విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, కూరగాయలు తదితర వస్తువులను పరిశీలించారు.
ప్రతిరోజూ భోజనం ఎలా పెడుతున్నారని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం స్టూడెంట్స్‌తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ధారూరు ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీఉల్లా ఖాన్, తహసీల్దార్ షాజీదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, కేజీబీవీ ఎస్‌వో, సిబ్బంది ఉన్నారు.

నకిలీ పత్రాలతో ఇంటి స్థలం కాజేందుకు యత్నం

నిందితులను అరెస్టు చేసిన షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్, డిసెంబర్ 13 : నకిలీ పత్రాలతో ఇంటి స్థలాన్ని కాజేందుకు యత్నించిన ముగ్గురు నిందితులను షాద్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కిరణ్ తివారీ అనే మహిళ కుటుంబంతో కలిసి కొంతకాలంగా షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివసిస్తున్నది. 2013లో ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 117, 118, 115 గల భూమిలో 133 చదరపు గజాల స్థలాన్ని ఆమె కొన్నది. అయితే ఆ స్థలాన్ని కాజేసేందుకు హైదరాబాద్‌లోని చార్మినార్ కాళికమాన్‌కు చెందిన నిరుడ గోపాల్, దర్గా గోపేశ్వర్, అశోక్ అనే ముగ్గురు వ్యక్తులు కుట్రపన్నారు. ఇందులో భాగంగానే కిరణ్ తివారీ మృతి చెందినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించారు. కిరణ్ భర్త దీపక్ తివారీని తానే అని, ఆ ఆస్తికి వారసులం మేమే అని గోపాల్ లీగల్ హెయిర్ పత్రాన్ని సృష్టించి షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2021లో 133 చదరవు గజాల ఇంటి స్థలాన్ని తన పేరున సేల్ డీడ్ చేయించుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లోని యాకుత్‌పురకు చెందిన అబ్దుల్ జలీల్‌కు విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు 2023 సెప్టెంబర్‌లో షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పట్లోనే పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టిన పోలీసు లు గోపాల్, గోపేశ్వర్, అశోక్‌లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. నకిలీ ధ్రువపత్రాలను సృష్టించడంలో అశోక్, డాక్యుమెంట్ రైటర్ విజయ్ పాత్ర ఉన్నదన్నారు. అప్పటి షాద్‌నగర్ ఎస్ఆర్‌వో పాత్రపైనా విచారణ చేపట్టామని షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థినులు రూపొందించిన నమూనాలను పరిశీలించి.. వాటి పనితీరును అడిగి తెలుసుకుంటున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

- అప్పుడే గుర్తింపు లభిస్తుంది
- శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్
- ముగిసిన జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన

వికారాబాద్, డిసెంబర్ 13 : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్లు ఎంతో దోహదపడుతాయని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని.. అప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. న్యూటన్, ఐన్‌స్టీన్, సీవీ రామన్ తదితరులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆవిష్కరణలకు అంతం లేదన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నదని.. అందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. త్వరలోనే వికారాబాద్ జిల్లా కేంద్రంలో వైజ్ఞానిక సైన్స్ కేంద్రాన్ని ప్రారంభించుకుందామని సభావేదికగా ఆయన తెలిపారు.

అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు మంచి వాతావరణం కల్పిస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా రూ.23 కోట్లతో 786 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, మిగతా 216 పాఠశాలల్లో పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. 398 వైజ్ఞానిక ప్రదర్శనల్లో రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనగా.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డీఈవో రేణుకాదేవి, ప్రిన్సిపాల్ సాయిలత, జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్, ప్రైవేట్ పాఠశాలల రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, వైజ్ఞానిక ప్రదర్శనల న్యాయ నిర్ణేత ముత్తారెడ్డి, వివిధ కళాశాలలు, పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి శీతల్

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శీతల్

వికారాబాద్, డిసెంబర్ 13 : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి శీతల్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బాల్యవివాహాలు, న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలతో కలిగే ప్రయోజనాలు, సమాజంలో మనం నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి విద్యార్థులకు వివరించారు. మైనర్లు వాహనాలను నడపొద్దన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, కాలేజీ ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

మ్యాకల శ్రీశైలం(ఫైల్)

మ్యాకల వెంకటమ్మ(ఫైల్)

కొడుకు మరణవార్త విని

కుప్పకూలిన తల్లి

ఒకే రోజు తల్లీకుమారుడి మృతి.. లింగంపల్లిలో విషాదఛాయలు

కులకచర్ల, డిసెంబర్ 13 : చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందగా ఆ విషయం తెలిసి అతడి తల్లి కుప్పకూలి మరణించిన ఘటన చౌడాపూర్ మండలంలోని లింగంపల్లిలో జరిగింది. లింగంపల్లి గ్రామానికి చెందిన మ్యాకల శ్రీశైలం (34) గత నెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో అతడు ఒక వీడియోలో తన ఆవేదనను వ్యక్తం చేస్తూ చావుకు కారణం లింగంపల్లికి చెందిన బాల్‌రాజ్, లక్ష్మణ్, రాములుగా పేర్కొన్నాడు. కాగా అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శ్రీశైలం మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే అతడి తల్లి వెంకటమ్మ (52) ఉన్న చోటే కుప్పకూలి మృతి చెందింది. తల్లీకుమారుడు ఒక్క రోజే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా పోలీసులు బాల్‌రాజ్, లక్ష్మణ్, రాములును అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్ కోసం పరిగి సబ్ జైలుకు తరలించారు.

'మన ఊరు- మన మనబడి' నిధులు విడుదల చేయాలి

'మన ఊరు-మన బడి' నిధులను వెంటనే విడుదల చేయాలని పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఘనాపూర్ రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాలల్లో పనులు చేపట్టిన పలువురితో కలిసి హైదరాబాద్‌లోని డీఎస్సీ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెంకట్‌రాంరెడ్డికి ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 'మన ఊరు-మన బడి' పనులు చేపట్టి ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని.. అప్పులు చేసి, బంగారాన్ని తాకట్టు పెట్టి పనులు చేపట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిధులను విడుదల చేయాలన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కులకచర్ల మాజీ ఎస్ఎంసీ చైర్మన్ రవిచంద్ర, బొంరెడ్డిపల్లి నాయకుడు చంద్రయ్య, ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన అరవింద్, దోమ మండలానికి చెందిన వెంకటయ్య, బొంపల్లి చంద్రశేఖర్, కోడూరు మండలానికి చెందిన జంగయ్య, హరికృష్ణ తదితరులు ఉన్నారు. -కులకచర్ల, డిసెంబర్ 13

విద్యార్థులతో చాకిరీ

- స్టూడెంట్స్‌తో పరికరాలు, సామగ్రిని మోయించిన ఉపాధ్యాయులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పేరెంట్స్

మండలంలోని జీవన్గి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు దగ్గరుండి విద్యార్థులతో పనులు చేయించారు. మధ్యాహ్నం 2:30 గంటల ప్రాంతంలో కొంతమంది ఉపాధ్యాయులు తరగతి గదులు, స్టాఫ్ రూంలో కూర్చోని ఉండగా, ఓ ఉపాధ్యాయుడు చేతిలో బెత్తం పట్టుకుని పిల్లలను గద్దిస్తూ పనులు చేయించడం కనిపించింది. విలేకరులు ఫొటోలు తీయడాన్ని గమనించిన టీచర్లు బయటికొచ్చి విశ్రాంతి సమయం కావడంతో ఒక గదిలోని సామగ్రి, పరికరాలను మరో గదిలోకి మార్పిస్తున్నట్లు చెప్పారు. మరో టీచర్ మాట్లాడుతూ ఓ ఉపాధ్యాయుడు కొత్తగా వచ్చాడు అతడికి పిల్లలతో పనులు చేయించడం తప్పని తెలియదని పేర్కొనడం గమనార్హం. పాఠాలు నేర్పించే ఉపాధ్యాయులు పిల్లలతో పనులు చేయించడంపై గ్రామస్తులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ గ్రామస్తుడు మా ట్లాడుతూ ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు పడడం లేదన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు అప్పటికే పాఠశాల నుంచి వెళ్లిపోయారని గ్రామస్తులు విలేకరులకు చెప్పారు. -బషీరాబాద్, డిసెంబర్ 13

రేపటి నుంచి గ్రూప్ - 2 పరీక్షలు

బస్సుల సమాచారం కోసం ప్రత్యేక కాల్ సెంటర్లు

సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 పరీక్షలు ఆది, సోమవారాల్లో జరుగుతున్న దృష్ట్యా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయంలో చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 101 పరీక్షా కేంద్రాలుండగా.. నగరం నలుమూలల నుంచి బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు. బస్సుల సమాచారం కోసం.. కోఠి - 99592 26160, రేతిఫైల్ బస్ స్టేషన్ - 99592 26154 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సింథటిక్ కలర్స్‌తో ఆహారం!

సిటీబ్యూరో: హెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఓఆర్ఆర్, ముత్తంగి పరిసర ప్రాంతాల్లోని పలు హోటళ్లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ముత్తంగి ఇస్తారా బాబాయ్‌లో వంటగది అపరిశుభ్రంగా, కొన్ని కూరగాయలు కుళ్లిపోయినవి, పాడైపోయి ఉండడాన్ని గుర్తించారు. తయారు చేసిన ఆహారంలో ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు తనిఖీలో తేల్చారు. ముత్తంగి గుల్షాన్ హోటల్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలతో సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ది ప్లేస్-2లో వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు తేల్చారు. ఫ్రిజ్‌లో వెజ్ అండ్ నాన్‌వెజ్ ఫుడ్స్ ఒకే చోట నిల్వ చేశారని, అపరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉన్నదని, ఆహార ప్యాకెట్లకు లేబుళ్లు సరిగ్గా లేవని, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని గుర్తించి చర్యలు తీసుకున్నారు.